సాక్షి మహబూబాబాద్

శుక్రవారం । 22 । మార్చి । 2024



అర్హుల ఆనందహేళ..
టీఎస్ ఎస్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాల్లో గృహజ్యోతి ద్వారా మొదటి విడతలో 19 లక్షల 70వేల మంది రూ.55.55 కోట్ల మేర లబ్ధి పొందారు. - 8లో▸



చీట్‌ఫండ్.. - 8లో▸
ప్రజలు పొదుపు చేసుకుంటున్న సొమ్మును చిట్‌ఫండ్ నిర్వాహకులు దారిమళ్లిస్తున్నారు. పొదుపు చేసుకుంటున్న సొమ్మును రియల్ ఎస్టేట్ రంగంలో ఇన్‌వెస్ట్ చేస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
34.7°/19.7°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

గుంజేడు ఆలయంలో మంత్రి సీతక్క పూజలు



కొత్తగూడ: మండలంలోని గుంజేడు ముసలమ్మ ఆలయంలో గురువారం రాత్రి మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు ఆలయ మర్యాదల ప్రకారం ఆమెకు స్వాగతం పలికారు. జాతరను పురస్కరించుకుని అమ్మవారి పడగల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఆదివాసీ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎంచగూడెం గ్రామంలో జరుగుతున్న కొమ్మలమ్మ జాతరలో పాల్గొని పూజలు చేశారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు



కేసముద్రం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో స్వీప్ కార్యక్రమాలో భాగంగా గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఆర్‌డీఓ పురుషోత్తం హాజరై మాట్లాడుతూ.. ఓటర్లందరూ పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులు ఓటు హక్కు ప్రాధాన్యతను తమ తల్లిదండ్రులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దామోదర్, డీఆర్డీఏ డీపీఎం రాజు, ప్రిన్సిపాల్ స్వప్న, ఏపీఎం రాజీర్, సీసీ వెంకటనారాయణ, అశోక్‌పాల్, శ్యామ్, టీచర్లు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి



కురవి: ప్రజలు వేసవికాలంలో ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ సేవలు, డెలివరీ గది, ఐఎల్‌ఆర్, వివిధ రికార్డులను ఆయన పరిశీలించారు. గర్భిణులతో మాట్లాడారు. సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మలేరియా, ఫైలేరియా, టీబీ తదితర వ్యాధులపై జాగ్రత్తలు తీసుకునేలా రోగులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ విరాజిత, సీహెచ్‌ఓ కృష్ణార్జున్, ఎస్‌పీఓ వడ్డెబోయిన శ్రీనివాస్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణ అందరి బాధ్యత



మహబూబాబాద్ రూరల్: అడవుల పరిరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ డివిజనల్ అధికారి(ఎఫ్‌డీఓ) పోలోజు కృష్ణమాచారి అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో అటవీ అధికారులు, సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ మాట్లాడుతూ.. అటవీ సంపదను కాపాడుకుంటేనే భవిష్యత్ తరాలకు మనుగడ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ జ్యోత్స్న, డీఆర్వోలు సాంబు, రీనా, సరోజ, ఎఫ్ఎస్ఓలు బాలాజీ, నవీన్, ఎఫ్‌బీఓలు హరిసింగ్, నవీన్, వీరన్న, లక్ష్మణ్, బాలు, స్వామి, నర్మద, ప్రత్యూష, శ్రీధర్ పాల్గొన్నారు.

గెలుపు బాధ్యత ఎమ్మెల్యేలదే

మానుకోట పార్లమెంట్ స్థానం కైవసమే లక్ష్యం

- మంచి మెజార్టీ తేవాలని కాంగ్రెస్ అధిష్టానం ఆదేశం
- ప్రచారానికి ఓకే.. డబ్బుతోనే సమస్య
- ఎన్నికల రంగంలోకి దిగాలని కార్యకర్తలకు ఎమ్మెల్యేల పిలుపు



సాక్షి, మహబూబాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లోనూ సత్తాచాటాలని చూస్తోంది. రాష్ట్రంలోని 17ఎంపీ స్థానాలు గెలిచి క్లీన్‌స్వీప్ చేయాలని ఆ పార్టీ ముఖ్యనేత రాహుల్‌గాంధీ రాష్ట్ర నాయకులకు సూచించినట్లు తెలిసింది. ఈమేరకు పార్టీ రాష్ట్ర పెద్దలు అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యేలు పని చేయాలని ఆదేశించినట్లు ప్రచారం. కాగా మానుకోట అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపు బాధ్యతలను పార్లమెంట్ పరిధిలోని ఆరుగురు పార్టీ ఎమ్మెల్యేలపై వేశారు. దీంతో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు. కార్యసాధనకు ఎన్నికల రణరంగంలోకి దిగాలని సూచించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 6,85,897ఓట్లు..

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్ ఇంకా పూర్తిస్థాయిలో ప్రచారం మొదలు పెట్టకముందే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి వచ్చిన ఓట్ల వివరాలు తెలుసుకుంటున్నారు. పార్లమెంట్ పరిధిలో మహబూబాబాద్, డోర్నకల్, ములుగు, నర్సంపేట, ఇల్లెందు, పినపాక అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. భద్రాచలంలో మాత్రం 5,719 ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి గెలిచారు. కాగా 57,309 ఓట్ల మెజార్టీతో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య గెలుపొంది మొదటిస్థానంలో ఉండగా.. 53,131 ఓట్ల మెజార్టీతో డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ రెండో స్థానంలో ఉన్నారు. కాగా పార్లమెంట్ పరిధిలో మొత్తం 15,26,998 ఓటర్లు ఉండగా.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 6,85,897 ఓట్లు వచ్చాయి. ఈ ఓట్ల ద్వారా ప్రత్యర్థుల కన్నా కాంగ్రెస్ అభ్యర్థులకు 2,47,706ఓట్ల మెజార్టీ వచ్చింది. ఇదే మెజార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చేలా కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది.

వారి లెక్కలు వారివి..

బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కవిత తన సొంత అసెంబ్లీ నియోజకవర్గం మహబూబాబాద్, తల్లిగారి నియోజకవర్గం డోర్నకల్, అత్తగారి నియోజకవర్గం ఇల్లెందులో రాజకీయాలకతీతంగా ఓట్లు పడుతాయని లెక్కలు వేసుకుంటోంది. అదేవిధంగా బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ ములుగు, నర్సంపేట నియోజకవర్గాల్లో మెజార్టీ వస్తుందని కార్యకర్తలతో చెబుతున్నారు. ఇదే జరిగితే అసెంబ్లీ ఎన్నికల తీర్పు తారుమారు అయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

అది వేరు.. ఇది వేరు..

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ తగ్గకుండా బలరాంనాయక్‌ను గెలిపించుకోవాలని అధిష్టానం ఆదేశించింది. అయితే ఎమ్మెల్యే ఎన్నికలు వేరు.. ఎంపీ ఎన్నికలు వేరని గెలుపోటములు తమపై రుద్దవద్దని నాయకులు, కార్యకర్తలు అంటున్నారు. ఇదిలా ఉండగా తాము ఎన్నికల ప్రచారం మాత్రమే చేస్తామని, ఖర్చులు పెట్టలేమని, అసెంబ్లీ ఎన్నికల్లో పెట్టిన డబ్బుల అప్పులే కుప్పలుగా ఉన్నాయని పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు అంటున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు

నియోజకవర్గం	కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు	అభ్యర్థి మెజార్టీ
మహబూబాబాద్	1,15,587	50,171
డోర్నకల్	1,16,644	53,131
నర్సంపేట	1,04,185	18,889
ములుగు	1,02,267	33,700
పినపాక	90,510	34,506
ఇల్లెందు	1,09,171	57,309
భద్రాచలం	47,533	5,719 (బీఆర్ఎస్)
మొత్తం	6,85,897	(2,47,706 కాంగ్రెస్ మెజార్టీ)

శాంతియుత ఎన్నికలకు సహకరించాలి



ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, పోలీసు అధికారులు

- ఫ్లాగ్‌మార్చ్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్

మహబూబాబాద్ రూరల్: శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మానుకోట పట్టణంలో కేంద్ర పోలీసు బలగాలు, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది గురువారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు ధైర్యంగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు సహకరించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జోగుల చెన్నైయ్య, ట్రైనీ ఐపీఎస్ పండరి చేతన్, డీఎస్పీలు తిరుపతిరావు, సురేష్, డీసీఆర్బీ డీఎస్పీ మోహన్, ఏఆర్ డీఎస్పీలు విజయ్ ప్రతాప్, శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు, ఏఆర్, సివిల్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మహబూబాబాద్: తాగునీటి సమస్య తలెత్తకుండా యాక్షన్‌ప్లాన్‌తో ముందుకెళ్లాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి తాగునీటి యాక్షన్‌ప్లాన్‌పై అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవికాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బావుల పూడికతీత, బోర్ల మరమ్మతులు ఇతర పనులు చేపట్టాలన్నారు. నీటి వనరులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రధానంగా వసతి గృహాల్లో నిరంతరం తాగునీరు అందించాలన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ సురేందర్, డీపీఓ హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్లు నోముల రవీందర్, శాంతకుమార్, వెంకటేశ్వర్లు, నరేష్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తునికాకు టెండర్లు నిర్వహించాలి



ధర్నా చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

మహబూబాబాద్ రూరల్: తునికాకు టెండర్లు వెంటనే నిర్వహించాలని కోరుతూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో జిల్లా అటవీశాఖ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడ సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జు దేవేందర్ మాట్లాడుతూ.. ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో తునికాకు గిరిజనులు, గిరిజనేతరులకు ఒక ఆర్థిక వనరు అని, తునికాకుపై ఐదు లక్షల మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. సీజన్ ప్రారంభమైనప్పటికీ ఇంతవరకు చాలా యూనిట్లలో టెండర్లు నిర్వహించలేదని, దాని ఫలితంగా కూలీలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. 2016 నుంచి పలు కారణాల వల్ల 50శాతం తునికాకు కూలీలకు బోనస్ రాలేదని, ఇందులో అవినీతి, అవకతవకలు జరిగాయని ఆరోపించారు. బోనస్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ఫారెస్ట్ అధికారులు నిర్లక్ష్యం వీడి వెంటనే టెండర్లు, ప్రూనింగ్ పనులు పూర్తి చేయాలనన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, లింగయ్య, యాదగిరి, నర్సన్న, సోమన్న, శ్రీశైలం, రవి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు ప్రశాంతంగా జరగాలి



జూమ్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న డీఈఓ

మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా సీఎస్, డీఓలు చర్యలు తీసుకోవాలని డీఈఓ రామారావు అన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి గురువారం పదో తరగతి పరీక్షలపై అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. 23న గణిత పరీక్ష ఉంటుందని, ప్రతి రోజు హాజరు నమోదును 11గంటల లోపు జిల్లా కంట్రోల్ రూమ్‌కు పంపించాలన్నారు. ఇంగ్లిష్ పరీక్షకు 8,178 మంది విద్యార్థులకు 8,160 మంది హాజరయ్యారన్నారు. కురవి, మరిపెడ పరీక్ష కేంద్రాలను పరిశీలించామని, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు పలు పరీక్ష కేంద్రాల్లో తనిఖీ చేశారని చెప్పారు.

ఎన్‌ఓసీల బాగోతం!

నిజాం చెరువు ఎఫ్‌టీఎల్‌కు ఎన్‌ఓసీలు ఇచ్చిన అధికారులు

- కొనుగోలు చేసిన వ్యాపారులు, సామాన్యులు
- చెరువులోని రోడ్లను తొలగించాలని కోర్టును ఆశ్రయించిన మత్స్యకారులు
- సర్వేతో బయటపడిన వాస్తవాలు
- ఆందోళన బాట పట్టిన పలువురు



వివాదాస్పదంగా మారిన నిజాం చెరువు ఇదే

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో భూముల ధరలు విపరీతంగా పెరగడంతో కబ్జాదారుల కన్ను చెరువులపై పడింది. మానుకోట పట్టణ పరిధిలోని చెరువులన్నీ అన్యాక్రాంతమై కంటలుగా మారాయి. ఈక్రమంలో ఇరిగేషన్ అధికారులు కబ్జాదారులకు సహకరించి నిజాం చెరువు ఎఫ్‌టీఎల్‌కు ఎన్‌ఓసీలు ఇచ్చారు. కొంతమంది బడా వ్యాపారులతో పాటు సామాన్యులు భూములు కొనుగోలు చేశారు. కాగా చెరువులోని రోడ్లను తొలగించాలని మత్స్యకార్మికులు కోర్టును ఆశ్రయించగా.. చెరువు మొత్తం సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించింది. అయితే అధికారులు సర్వే చేస్తుండగా.. తమ భూములు ఎఫ్‌టీఎల్‌లో లేవని, పట్టాలు ఉన్నాయని కొంత మంది బాధితులు సర్వేకు అభ్యంతరాలు తెలుపగా మరికొంత మంది సర్వే చేసి హద్దులు కేటాయించాలని ఆందోళన బాటపట్టారు.

విచ్చలవిడిగా...

నిజాం చెరువు విస్తీర్ణం 67 ఎకరాలు ఉందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. అయితే చాలావరకు అన్యాక్రాంతం కాగా ప్రస్తుతం 25ఎకరాలలోపు మిగిలింది. కాగా కొంతమంది అధికారులు కాసులకు కక్కుర్తిపడి నిజాం చెరువు ఎఫ్‌టీఎల్‌కు ఎన్‌ఓసీలు ఇచ్చారు. ఆ భూముల (కొన్ని సర్వే నంబర్లు 664,669, 651 నుంచి 667 వరకు)కు పట్టాలు ఉండడంతో బడా బాబులతో పాటు సామాన్యులు చాలామంది కొనుగోలు చేశారు. కాగా బడా వ్యాపారులు గజాలలో అమ్ముకుని భారీగా దండుకున్నారు. ఇదిలా ఉండగా అధికారులు ఎకరానికి రూ.5లక్షలు తీసుకొని ఎన్‌ఓసీ ఇచ్చారని బాధితులు చెబుతున్నారు.

హైకోర్టును ఆశ్రయించడంతో..

నిజాం చెరువు మధ్యలో నిర్మాణం చేసిన నక్లెస్ రోడ్డు, పెద్దమ్మతల్లి దేవాలయం నుంచి హస్తినాపురంకాలనీ వరకు వేసిన రోడ్డు ఎవరికీ ఉపయోగం లేదని, ఆ రెండు రోడ్లను తొలగించాలని మత్స్యకారులు హైకోర్టును ఆశ్రయించారు. కాగా కోర్టు ఆదేశాలతో ఇరిగేషన్‌శాఖ డీఈ కిషోర్‌కుమార్‌తో పాటు, ఏఈ శ్రావణి, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఆర్‌ఐ కృష్ణ ప్రసాద్ ఈనెల 13న సర్వే చేపట్టారు. అయితే హస్తినాపురంకాలనీవాసులతో పాటు శ్రీరాంనగర్ కాలనీవాసులు కోర్టు స్టే ఉందని సర్వేకు అభ్యంతరాలు తెలిపారు. లే అవుట్ చేసిన భూములను కొనుగోలు చేశామని, ఎన్‌ఓసీ ఉందని పత్రాలు చూపారు. దీంతో చేసేదేమీ లేక అధికారులు సర్వే నిలిపివేశారు. అయితే ఆప్రాంతం తప్ప మిగిలిన చోట్ల సర్వే పూర్తి చేశారు.

ఆందోళన బాట..

గతంలో ఎఫ్‌టీఎల్‌లో లేవని ఎన్‌ఓసీ ఇచ్చిన భూములను ప్రస్తుతం సర్వే చేసి ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని హద్దులు కేటాయిస్తున్నారని పలువురు బాధితులు ఆందోళన బాటపట్టారు. తెలంగాణ ముస్లిం జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఇటీవల ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. మక్బూల్‌కు కేటాయించిన ఎకరం భూమిలో షాదీఖానా నిర్మాణం కోసం ఇరిగేషన్ డీఈ రూ.5లక్షలు డిమాండ్ చేశారని ఆరోపించారు. గతంలోనూ లక్షలాది రూపాయలు తీసుకుని ఎన్‌ఓసీలు ఇచ్చారని అన్నారు. అలాగే గోపాల్‌రావు ప్రాంతంలో తక్కువ ధరలకు భూములు వస్తున్నాయని చాలామంది కొనుగోలు చేశారు. ఆ తర్వాత ఇంటి నిర్మాణం కోసం మున్సిపాలిటీకి వెళ్తే అనుమతి ఇవ్వలేదు.

సర్వేకు సహకరించాలి

నిజాం చెరువు చాలా వరకు సర్వే పూర్తయింది. ఎఫ్‌టీఎల్ హద్దులు కేటాయించాం. కోర్టు కేసుల భూముల విషయంలో కోర్టులో కేసు వేసి తిరిగి సర్వే చేస్తాం. ఎఫ్‌టీఓలు, బఫర్ జోన్ భూములు కబ్జా చేస్తే ఊరుకోం. కబ్జా జరిగిన భూములను స్వాధీనం చేసుకుంటాం.

– కిషోర్ కుమార్, ఇరిగేషన్ డీఈ

ఎన్‌ఓసీలు ఇచ్చారు..

ఇరిగేషన్ అధికారులు గతంలోనే సర్వే చేసి హద్దులు కేటాయించారు. ఎఫ్‌టీఎల్‌లో లేవని ఇచ్చిన ఎన్‌ఓసీ భూములు చాలా మంది కొనుగోలు చేశారు. తిరిగి సర్వే చేసి ఎఫ్‌టీఎల్ హద్దులు పెడుతున్నారు. నిజాం చెరువు సమీపంలో షాదీఖానా నిర్మాణానికి ఎన్‌ఓసీ కోసం డీఈ రూ.5లక్షలు డిమాండ్ చేశారు. గతంలో లక్షలాది రూపాయలు తీసుకుని ఎన్‌ఓసీలు ఇచ్చారు.

– అహ్మద్ ఖాన్, బాధితుడు

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్

నెహ్రూసెంటర్: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, కార్మికుల అభ్యున్నతికి ప్రభుత్వాలు పాటుపడాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ అన్నారు. గురువారం తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మికులకు శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని, గుర్తింపు కార్డులు, పింఛన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, ఎక్స్‌గ్రేషియా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించాలని, రానున్న ఎన్నికల్లో కార్మిక వ్యతిరేక పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు లింగన్న, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శివకుమార్, ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి, నాయకులు పర్వత కోటేష్, మోహన్, చంద్రు, వీరన్న, మధు, యాసర్ల వెంకన్న పాల్గొన్నారు.

మార్కెట్ వార్షిక ఆదాయం రూ.6.88 కోట్లు



మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ వార్షిక ఆదాయం రూ.6.88 కోట్లు సమకూరినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన 2023–24వార్షిక ఆదాయం లక్ష్యం కంటే రూ.2.20 కోట్ల మేరకు అధికంగా వచ్చినట్లు చెప్పారు. కాగా ప్రస్తుతం వచ్చిన ఆదాయమే కాకుండా సీసీఐ పత్తి కొనుగోళ్ల ద్వారా మార్కెట్ ఫీజు రూ.25లక్షల వరకు రావాల్సి ఉంది. ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రూ.1.94కోట్లకు పైచిలుకు మార్కెట్ ఫీజు రావాల్సి ఉంది. కాగా మార్కెట్ 2021–22వార్షిక ఆదాయ లక్ష్యం రూ.2.46 కోట్లు కాగా రూ.4.10 కోట్లు వచ్చింది. 2022–23 వార్షిక ఆదాయ లక్ష్యం రూ.4.10 కోట్లు కాగా రూ.6.20 కోట్లు సమకూరింది.

వ్యాధిగ్రస్తులను గుర్తించాలి



సర్వేలో పాల్గొన్న డీఎంహెచ్ఓ, వైద్యాధికారులు

నెహ్రూసెంటర్: కుష్టు వ్యాధిగ్రస్తులను సర్వేలో గుర్తించి చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి అన్నారు. పట్టణంలో వైద్య సిబ్బంది చేపడుతున్న సర్వేను గురువారం ఆమె పర్యవేక్షించి మాట్లాడారు. ఇంటింటి సర్వేలో స్పర్శలేని మచ్చలను గుర్తించి బాధితుడిని పీహెచ్‌సీకి తరలించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. అలాగే గుమ్ముడూరు ఆయుష్మాన్, పల్లె దావాఖానను ఆమె తనిఖీ చేసి వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష, డాక్టర్ విజయ్‌కుమార్, డీపీఓ రవీందర్‌రావు, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, సీహెచ్‌ఓ కృష్ణార్జునరావు, డాక్టర్ కిరణ్మయి, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'యశోద'లో రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ

● డాక్టర్ సునీల్ దాచేపల్లి



రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ గురించి వివరిస్తున్న డాక్టర్ సునీల్

హన్మకొండ చౌరస్తా: హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ కీహోల్ సర్జరీలు ఇప్పటి వరకు 400లకు పైగా విజయవంతంగా చేశానని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సునీల్ దాచేపల్లి అన్నారు. హనుమకొండలోని అశోకా హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లండన్‌లో పదేళ్ల ప్రత్యేక శిక్షణ పొంది 2014 నుంచి భారత్‌లో సర్జరీలు చేస్తున్నట్లు తెలిపారు. తన సేవలను గుర్తించి యూకేలోని వైటింగ్టన్ హాస్పిటల్ యాజమాన్యం బంగారు పతకంతో సన్మానించిందన్నారు. చాలా మందిలో మోకాళ్ల అరుగుదల సాధారణంగా మారిందని, నొప్పులను భరించలేక కొందరు ఇంజక్షన్ వేసుకుని వదిలేస్తున్నారని, తప్పనిసరిగా సర్జరీ చేసుకోవాలని సూచించారు. రోబోటిక్ సర్జరీ ద్వారా మోకాళ్లలో పరికరాలను కచ్చిత పద్ధతిలో అమర్చొచ్చన్నారు. ఈ సందర్భంగా సర్జరీ చేసుకున్న వృద్ధురాలితో మాట్లాడించారు.

ఆటో బోల్తా .. ఐదుగురికి గాయాలు

చిట్యాల: ఆటో బోల్తాపడి ఐదుగురికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు కథనం ప్రకారం.. మండలంలోని తిర్మలాపూర్‌కు చెందిన గోపగాని శోభ, వసంత, పద్మ, సమ్మక్క ఆటోలో మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ వద్దకు వస్తున్నారు. ఈ క్రమంలో వెంకట్రావుపల్లి (సి) అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఓ చిన్నారి రోడ్డు దాటుతోంది. పాపను తప్పించబోయి ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న వారితో పాటు ఆటో డ్రైవర్ అశోక్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ఆసుపత్రికి తరలించారు. మరో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం వరంగల్ తరలించారు.

చీట్ ఫండ్..

ప్రజల సొమ్మును వెంచర్లలోకి దారిమళ్లిస్తున్న నిర్వాహకులు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో కనుమరుగవుతున్న చిట్స్ బిజినెస్
- రూ. 100 కోట్ల నుంచి రూ. 15 కోట్లకు పడిపోయిన టర్నోవర్
- బోర్డు తిప్పేసిన 9 చిట్‌ఫండ్ కంపెనీలు.. అదే బాటలో మరికొన్ని..
- అధికారుల పర్యవేక్షణ కరువు.. పీఎస్ మెట్లు ఎక్కుతున్న బాధితులు



కాజీపేట అర్బన్ : భవిష్యత్ అవసరాల నిమిత్తం చిన్న మొత్తంలో ప్రజలు పొదుపు చేసుకుంటున్న సొమ్మును చిట్‌ఫండ్ నిర్వాహకులు దారిమళ్లిస్తున్నారు. చిట్‌ఫండ్ బిజినెస్‌లో లాభాలు రాకపోవడంతో ప్రజలకు కుచ్చుటోపి పెట్టి వారు నెలనెలా పొదుపు చేసుకుంటున్న సొమ్మును రియల్ ఎస్టేట్ రంగంలో ఇన్‌వెస్ట్ చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే సొమ్మును తిరిగి చెల్లించమని ఖరాఖండి చెబుతున్నారు. పైగా బలవంతంగా ప్లాట్ అంటగడుతున్నారు. ఒకవేళా వద్దంటే భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులు తమ నెలసరి ఆదాయం నుంచి కొంత మొత్తాన్ని పొదుపు చేసి ఆర్థిక అవసరాలకు వినియోగించుకునేందుకు చిట్స్ వైపు ఆసక్తి కనబరుస్తారు. ఈ క్రమంలో ప్రైవేట్ చిట్స్‌తో తమ సొమ్ముకు భద్రత ఉండదని భావించి ప్రభుత్వం ఆమోదం పొందిన రిజిస్టర్డ్ చిట్‌ఫండ్ కంపెనీల వైపు అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో దొందూదొందే అన్న చందంగా ప్రైవేట్ చిట్ యజమాని రాత్రికి రాత్రే ప్రజల సొమ్ముతో పరారీ అవుతుండగా.. ప్రభుత్వ ఆమోదం పొందిన చిట్ ఫండ్ కంపెనీలు బోర్డు తిప్పేసి చిట్ డబ్బులు ఇవ్వక ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నాయి. ఫలితంగా చిట్స్ కంపెనీలు చీటింగ్‌తో ఓ వైపు.. అధికారులు స్పందించకపోవడంతో మరో వైపు బాధితులకు కన్నీళ్లే మిగులుతున్నాయి.

అధికారుల పర్యవేక్షణ కరువు..

వరంగల్ ఆర్వో కార్యాలయంలోని చిట్స్ సహాయ రిజిస్ట్రార్ బాధితులకు భరోసానివ్వకపోవడం.. చిట్ ఫండ్ కంపెనీలపై పర్యవేక్షణ కొనసాగించకపోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రీవెన్స్ మాదిరి జిల్లా రిజిస్ట్రార్‌కు ప్రతి సోమవారం పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయంటే చిట్స్ చీటింగ్ ఎలా ఉందో తెలుస్తోంది.

పీఎస్ మెట్లు ఎక్కుతున్న బాధితులు..

తమకు జవాబుదారీగా నిలుస్తారనుకున్న అధికారులతో విసిరివేసారిన చిట్స్ బాధితులు.. పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. ఇందులో భాగంగా గతంలో వరంగల్ పోలీస్ కమిషనర్‌కు అనేక ఫిర్యాదులు అందాయి. దీంతో చిట్‌ఫండ్ కంపెనీల యాజమాన్యంతో సీపీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సొమ్ము చెల్లించాలని తెలిపిన ఫలితం లేదు. పైగా తమ వెంచర్‌లో తక్కువ ధరకే ప్లాట్లు ఉన్నాయని, వీటిని తీసుకోవాలనే ఒత్తిడి మొదలైంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 262 బ్రాంచ్‌లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 262 బ్రాంచ్‌లతో వివిధ రిజిస్టర్డ్ చిట్‌ఫండ్ కంపెనీలు కొనసాగుతున్నాయి. వీటిలో 150కి పైగా సింగిల్ ఓనర్ అనగా బ్రాంచ్‌లు లేకుండా తమ చిట్స్ బిజినెస్ నడిపిస్తున్నాయి. కాగా రెండేళ్లుగా చిట్స్ కంపెనీలు తమ లావాదేవీలు నిలిపివేస్తూ వెంచర్లపై మక్కువ కనబరుస్తున్నాయి. దీంతో రాబోవు రోజుల్లో చిట్స్ కనుమరుగయ్యే ప్రమాదం లేకపోలేదు. గతంలో ప్రతి ఏడాది చిట్స్ కంపెనీల టర్నోవర్ రూ. 100 కోట్లపై బడి ఉండగా ప్రస్తుతం రూ. 15 కోట్లకు పడిపోవడమే ఇందుకు నిదర్శనం.

బోర్డు తిప్పేసిన 9 కంపెనీలు.. ఎఫ్‌డీల ఫ్రీజ్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటికే 9 చిట్‌ఫండ్ కంపెనీలు బోర్డు తిప్పేసి సభ్యులకు తమ సొమ్ము ఇవ్వకుండా చేతులు ఎత్తేశాయి. అదే బాటలో మరి కొన్ని కంపెనీలు పయనిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అక్షర, కనకదుర్గ, శుభనందిని, అచల వంటి కంపెనీల ఫిక్స్‌డ్ డిపాజిట్లను బ్యాంకుల్లో రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ఫ్రీజ్ చేశారు. కాగా, ఫ్రీజ్ చేసిన సొమ్మును తమకు ఇవ్వాలని బాధితులు వేడుకుంటున్నారు. ఇదిలా ఉండగా తమ సొమ్ము చెల్లించకపోవడంతో అక్షర చిట్ ఫండ్ ఖాతాదారులు ఆరు నెలల క్రితం సంఘం ఏర్పడ్డాడు. అనంతరం చిట్‌ఫండ్ కంపెనీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. దీనిపై స్పందించిన నిర్వాహకులు తమ స్థిరాస్తులు విక్రయించైనా ఇస్తామని చెప్పి నేటికీ చెల్లించలేదు. దీనిపై అధికారులు కూడా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఖాతాదారులు లబోదిమంటున్నారు.

రజాకార్ సినిమాను ఆదరించండి

- చిత్ర దర్శకుడు సత్యనారాయణ
- మానుకోటలో చిత్రయూనిట్ సందడి



మాట్లాడుతున్న నటి అనసూయ

మహబూబాబాద్ అర్బన్: రజాకార్.. మత, గత చరిత్ర, వివిధ పార్టీలకు సంబంధించిన సినిమా కాదని, తెలంగాణ చరిత్రకు సంబంధించిందని చిత్ర దర్శకుడు యాటా సత్యనారాయణ అన్నారు. గురువారం రజాకార్ చిత్ర విజయోత్సవ కార్యక్రమం జిల్లా కేంద్రంలోని లక్ష్మి థియేటర్‌లో నిర్వహించగా చిత్రయూనిట్, నటీ, నటులు సందడి చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సత్యనారాయణ, సంగీత దర్శకుడు భీమ్స్ మాట్లాడుతూ.. మన తెలంగాణ చరిత్రను పట్టించుకోవాలని, గ్రూప్‌కు సన్నద్ధమవుతున్న విద్యార్థులు ఈ రజాకార్ సినిమా చూడాలని, ఇందులో నుంచి సుమారు 10 ప్రశ్నలు రావొచ్చన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ, ఖిలా వరంగల్, పరకాలలో మొదటి సారి జెండా ఎగరవేయడం వంటి కథనం, చరిత్ర ఆధారంగా ఈ సినిమాను చిత్రీకరించామని, దీనిని ఆదరించాలన్నారు. అనంతరం నటి అనసూయ మాట్లాడుతూ.. మానుకోట బిడ్డ భీమ్స్ రజాకార్ సినిమాకు మంచి సంగీతం అందించారని, ఈ సినిమాను తెలంగాణ ప్రజలందరూ ఆదరించాలన్నారు. తెలంగాణ బతుకమ్మ గురించి, మన సంప్రదాయాలకు అద్దంపట్టేలా సినిమా తీశామన్నారు. అనంతరం యూనిట్ సభ్యులను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో యూనిట్ సభ్యులు రాజు అర్జున్, గూడూరు నారాయణ రెడ్డి, శ్రీగిరి, శివం, రమణ, బలగం సత్యనారాయణ, అంజిరెడ్డి, ప్రముఖ వైద్యులు వీరన్న, రంజిత్ రెడ్డి, లక్ష్మి థియేటర్ మేనేజర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బయ్యారంలో..

బయ్యారం: మండలకేంద్రంలో గురువారం 'రజాకార్' సినిమా యూనిట్ సందడి చేసింది. రజాకార్లకు వ్యతిరేకంగా ఉద్యమించి ప్రాణాలర్పించిన అమరుల చిహ్నంగా బయ్యారంలో నిర్మించిన అమరవీరుల స్తూపం వద్ద నివాళలర్పించింది. ఈ సందర్భంగా మండలవాసి, సినిమా సంగీత దర్శకుడు భీమ్స్‌సిసోడియా మాట్లాడారు. రజాకార్ సినిమాను ప్రతిఒక్కరూ చూడాలన్నారు. బయ్యారానికి చెందిన గాయకుడు, నటుడు వీరన్న చిత్ర యూనిట్‌కు స్వాగతం పలికారు, కార్యక్రమంలో యూనిట్ సభ్యులు అనసూయ, శ్రీగిరి, శివం, రమణ, సత్యనారాయణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మందులు విక్రయిస్తున్న ఫార్మసిస్టు అరెస్టు

- రూ. 80,844 విలువైన ఔషధాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ ఔషధాలు

ఎంజీఎం : ప్రభుత్వ మందులు విక్రయిస్తున్న వరంగల్ నేత్ర వైద్యశాల ఫార్మసిస్టు నాగేందర్‌ను ఇంతేజార్‌గంజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు గురువారం డ్రగ్ కంట్రోల్ అధికారులతో కలిసి టాస్క్ ఫోర్స్, ఇంతేజార్ గంజ్ పోలీసులు.. కాశిబుగ్గలోని నాగేందర్ ఇంటిని తనిఖీ చేశారు. ఈ సమయంలో ఇతర వ్యక్తికి ప్రభుత్వ మందులు అమ్ముతూ నాగేందర్ ప్రత్యక్షంగా పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. నాగేందర్ కొన్ని సంవత్సరాల నుంచి వైద్యుల ప్రిస్కిప్షన్ కంటే ఎక్కువ స్టాక్ చూపిస్తూ ఆస్పత్రిలో మందులు కాజేసి తనకు పరిచయమున్న బలరాందాసుకు విక్రయిస్తున్నాడు. హైదరాబాద్‌కు చెందిన బలరాం దాసు ప్రభుత్వ ఔషధాలను ఇతర మందుల షాపులకు విక్రయిస్తున్నాడు. ఈ దాడుల్లో రూ. 69,360 విలువైన అమాక్సిలిన్ పోటాషియం క్యాల్‌వెంట్, రూ.11,484 విలువైన ఐ డ్రాప్స్‌ను స్వాధీనం చేసుకుని డ్రగ్ కంట్రోల్ అధికారులు పంచనామా నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడీ రాజ్యలక్ష్మి, డ్రగ్ డీఐ కిరణ్, ఇంతేజార్ గంజ్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

బడుగులకు విద్య అందకుండా కుట్ర

- భారత్ బచావో జాతీయ వైస్ చైర్మన్ గోపీనాథ్



మాట్లాడుతున్న గోపీనాథ్

కేయూ క్యాంపస్: బడుగు, బలహీనవర్గాలకు విద్య అందకుండా పాలకవర్గాలు చేస్తున్న కుట్రే నూతన జాతీయ విద్యావిధానమని భారత్ బచావో జాతీయ వైస్ చైర్మన్ డాక్టర్ గోపీనాథ్ అన్నారు. గురువారం కేయూలోని బాటనీ విభాగం సెమినార్ హాల్‌లో నూతన జాతీయ విద్యావిధానంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వేల ఏళ్లనాటి మనుస్మృతిని అమలు చేయడం కోసమే మనువాద పాలకులు ఈ నూతన జాతీయ విద్యావిధానం తీసుకొచ్చారన్నారు. విద్యార్థులు దీనిని వ్యతిరేకించాలన్నారు. రిటైర్డ్ ఆచార్యుడు మార్క శంకర్‌నారాయణ మాట్లాడుతూ భారత రాజ్యాంగపు వెలుగులో నూతన జాతీయ విద్యావిధానం లేదని, హక్కులు ముచ్చట కరువైందన్నారు. సామాజిక న్యాయం అనే మాట ఆరవై ఆరు పేజీల ఎన్‌ఈపీ 2020లో లేదన్నారు. విద్యను ప్రైవేటు పరం చేసే దిశగానే వెళ్తుందన్నారు. అంతేగాకుండా అంబేడ్కర్, జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే, పెరియార్‌లాంటి మహనీయుల ఆలోచన పరంపరలేదన్నారు. ఈ సదస్సుకు కేయూ విద్యార్థి నాయకుడు శ్రావణ్ అధ్యక్షత వహించారు. డాక్టర్ ఎం వెంగళ్‌రెడ్డి, మున్నా గణేష్, సత్యం, శివ, అనిల్ మాట్లాడారు. సామాజిక స్పృహతో కేయూ విద్యార్థులు నూతన జాతీయ విద్యావిధానం రద్దుచేయాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఈసదస్సు నిర్వహించినట్లు వారు తెలిపారు.

సీపీఈ సెమినార్‌లో వరంగల్ సీఏలు



ఐసీఏఐ అధ్యక్షుడు రంజిత్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న సీఏ పీవీ నారాయణరావు

వరంగల్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ ఎకౌంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) ఆధ్వర్యంలో బ్యాంక్ ఆడిట్స్‌పై హైదరాబాద్‌లో గురువారం సీపీఈ సెమినార్ నిర్వహించారు. ఒక్క రోజు నిర్వహించిన సెమినార్‌లో వరంగల్, కరీంనగర్‌కు చెందిన సీఏలు పాల్గొన్నారు. ఈ సెమినార్‌లో ఐసీఏఐ అధ్యక్షులు సీఏ రంజిత్‌కుమార్, వరంగల్ బ్రాంచ్ మాజీ అధ్యక్షులు సీఏ పీవీ నారాయణ రావు, వరంగల్ అధ్యక్షుడు సీఏ భగవాన్ దాస్ ముందాడ, కార్యదర్శి సీఏ మాదారపు సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు



గుప్త నిధులకోసం గొయ్యి తీస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు



గుప్తనిధుల కోసం తీసిన గొయ్యి

- మల్లూరు గుట్టపై ఘటన
- పోలీసుల అదుపులో నలుగురు వ్యక్తులు?

మంగపేట : మల్లూరు గుట్టపై గల శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పరిసరాల్లో గుప్త నిధుల కోసం పది మంది గల ముఠా కొంత కాలంగా తవ్వకాలు జరుపుతోంది. ఈ క్రమంలో ఆలయ పరిసరాల్లోని చింతామణి జలపాతం సమీపం దేవునికుంటలోని మైసమ్మ రాతి విగ్రహం వద్ద గురువారం కొందరు.. స్థానికుల సహకారంతో క్షుద్రపూజలు నిర్వహించి తవ్వకాలు జరుపుతున్న క్రమంలో పక్కా సమాచారం మేరకు ఎస్సై గోదరి రవికుమార్ ఘటనా స్థలికి చేరుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మరి కొందరు పరారయ్యారు. నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పీఎస్‌కు తరలించారు. ఆలయ రికార్డ్ అసిస్టెంట్ గోనె లక్ష్మీ నారాయణకు చెందిన దేవునికుంట చేనులో కొందరు తవ్వకాలు జరుపుతున్నారు. ఈవిషయం తెలుసుకుని అతడు అక్కడికెళ్లి ప్రశ్నించగా ముఠా సభ్యులు దాడికి యత్నించారు. దీంతో లక్ష్మీ నారాయణ వెంటనే ఎస్సైకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చాడు. ఎస్సై అక్కడకు చేరుకోవడాన్ని గమనించి ముఠా సభ్యులు ద్విచక్రవాహనాలను వదిలేసి పరారయ్యారు. ఓ వ్యక్తి పట్టుబడగా అదుపులోకి తీసుకుని విచారించారు. తమను గుప్త నిధుల తవ్వకాల కోసం అటవీశాఖ అధికారి, మల్లూరుకు చెందిన శివరాత్రి వెంకన్న పిలిపించారని పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం. తవ్వకాలు జరిపిన వారిలో ఇద్దరు మహిళలు, మరో 8 మంది ఉన్నట్లు సమాచారం. పోలీసులు స్వాధీనం చేసుకున్న నాలుగు ద్విచక్రవాహనాల్లో అటవీశాఖ మల్లూరు బీట్‌ఆఫీసర్ విజయరావు, మల్లూరుకు చెందిన శివరాత్రి వెంకన్నకు చెందిన రెండు ద్విచక్రవాహనాలు ఉండడం వారితో పాటు మరికొందరు స్థానికుల ఆధ్వర్యంలో గుప్త నిధుల తవ్వకాలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఘటనా స్థలిలో అదుపులోకి తీసుకున్న వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసుల ఆధీనంలో మొత్తం నలుగురు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై ఎస్సై రవికుమార్‌ను వివరణ అడగగా పరారైన వారికోసం గాలిస్తున్నామని, పట్టుకున్న అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

- 2 కార్లు, 11 మోటార్లు, 57 కిలోల కాపర్ వైర్ స్వాధీనం




నిందితుల అరెస్ట్‌తోపాటు స్వాధీనం చేసుకున్న మోటార్లను చూపుతున్న పోలీసులు

పరకాల: విద్యుత్ మోటార్ల చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను పరకాల పోలీసులు అరెస్ట్ చేశారు. రెండు కార్లతోపాటు 11 మోటార్లు, రూ. 34వేల విలువైన కాపర్ వైర్, రూ.40వేల నగదు స్వాధీనం చేసుకుని ఓ బాలుడితో సహా ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. పరకాల పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పుల్ల రవీందర్ వివరాలు వెల్లడించారు. పరకాల పోలీసులు నడికూడ చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు కార్లు అనుమానస్పదంగా కనిపించాయి. వాటిని తనిఖీ చేయగా వ్యవసాయ బావులకు సంబంధించిన కాపర్ వైర్ లభ్యమైంది. దీంతో కార్లలో ఉన్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా అంతర్ జిల్లా దొంగలుగా తేలింది. హనుమకొండలోని అమరావతినగర్‌కు చెందిన మెకానిక్ బండారి అనిల్ విలాస జీవితానికి అలవాటుపడి ఓ బాలుడితోపాటు భూపాలపల్లి జిల్లా టేకుమట్లకు చెందిన మాటూరి అరవింద్, మొగుళ్లపల్లి మండలం కొరికిశాలకు చెందిన సరిగొప్పుల సాయితేజ, కమాలాపురం హరీష్‌ను మోటార్ల చోరీలకు ప్రోత్సహించాడు. దీంతో ఐదుగురు ఓ ముఠాగా ఏర్పడి మూడు నెలల నుంచి పరకాల, మొగుళ్లపల్లి, దామెర, ఇల్లంతకుంట మండలాలోని ఎస్సారెస్పీ కెనాల్ బావుల వద్ద ఉన్న మోటార్లను చోరీ చేశారు. అనంతరం మోటర్ల నుంచి కాపర్ వైర్ వేరు చేసి హుజూరాబాద్‌లో ఎక్కువ ధరకు అమ్ముకోవడానికి వెళ్తుండగా నడికూడ వద్ద పట్టుబడినట్లు తెలిపారు. నిందితులు ప్రయాణిస్తున్న రెండ్లు కార్లు, నాలుగు సెల్ ఫోన్లు, 57కిలోల కాపర్ వైర్, రూ. 40వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సీఐ రవిరాజు, ఎస్సై రమేష్, కానిస్టేబుళ్లు టి.భాస్కర్, జి.కృష్ణకుమార్, డి.దేవేందర్, డి.నాగరాజు, కె.నాగరాజు, వి.భాస్కర్, హోంగార్డు సుధాకర్, ఎం.రామన్న, పి.రవీందర్‌ను డీసీపీ రవీందర్, ఏసీపీ కిశోర్‌కుమార్ అభినందించారు.

అర్హుల ఆనందహేళ..

- ఎన్పీడీసీఎల్ పరిధిలో 'గృహజ్యోతి' బిల్లు రూ.55.56 కోట్లు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.11.65 కోట్లు




హన్మకొండ : టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాల్లో గృహజ్యోతి ద్వారా మొదటి విడతలో 19 లక్షల 70వేల మంది రూ.55.55 కోట్ల మేర లబ్ధి పొందారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4,39,563 మంది వినియోగదారులు జీరో బిల్లుల ద్వారా రూ.11.65 కోట్ల మేర లబ్ధి పొందారు. ఈ రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం టీఎస్ ఎన్పీడీసీఎల్‌కు చెల్లించనుంది. గృహజ్యోతి నిబంధనల ప్రకారం ప్రతి నెల 15వ తేదీలోపు బిల్లులు జారీ చేయాలి. ప్రస్తుత నెలలో జీరో బిల్లు ద్వారా రావాల్సిన మొత్తాన్ని మరుసటి నెల 20వ తేదీలోపు ప్రభుత్వానికి నివేదిక పంపాలి. ప్రభుత్వం ఈ రాయితీ మొత్తాన్ని డిస్కంకు చెల్లిస్తుంది. టీఎస్ ఎన్పీడీసీఎల్.. తన పరిధిలో 15వ తేదీ లోపు బిల్లులు జారీ చేసింది. ప్రభుత్వానికి మరుసటి నెల వివరాలు పంపాల్సి ఉన్నప్పటికీ ఏ రోజు సమాచారం అదే రోజు పంపించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 12,03,156 గృహ విద్యుత్ వినియోగదారులున్నారు. ఇందులో మొదటి విడతలో అర్హత సాధించిన గృహజ్యోతి సర్వీస్‌లు 4,50,923 ఉన్నాయి. ఇందులో 4,47,729 సర్వీస్‌లకు బిల్లులు జారీ అయ్యాయి. 4,39,563 మంది విద్యుత్ వినియోగదారులు 200 లోపు యూనిట్లు విద్యుత్ వినియోగించడంతో వీరికి జీరో బిల్లులు జారీ చేశారు.

వినియోగదారుల వివరాలు.. (జీరో బిల్లు మొత్తం రూ.కోట్లలో)

జిల్లా	మొత్తం కన్జూమర్స్	గృహజ్యోతి కన్జూమర్స్	బిల్లుల జారీ	జీరో బిల్లు	జీరో బిల్లు మొత్తం
హనుమకొండ	3,45,302	1,02,156	102156	98483	3.06
వరంగల్	2,86,156	1,02,836	102804	99477	2.88
భూపాలపల్లి, ములుగు	93,257	77250	74094	75109	1.82
జనగామ	1,69,375	78655	78655	77829	1.77
మహబూబాబాద్	2,09,066	90026	90020	88665	2.11



ప్రజలను వంచించిన కేసీఆర్



మాట్లాడుతున్న జంగా రాఘవ రెడ్డి

కాజీపేట : తెలంగాణ ప్రజలు కేసీఆర్ మాయమాటలు నమ్మి పదేళ్లు అధికారం అప్పగిస్తే కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని దోచుకోవడంతో పాటు అప్పుల కుప్పగా మార్చారని రాష్ట్ర కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి విమర్శించారు. కాజీపేట మీడియా పాయింట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్వకుంట్ల కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఓట్లు వేసి ఇంటికి పంపించారన్నారు. అయితే ఇదీ జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు.. కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధిపొందడం కోసమే కాంగ్రెస్ పాలనపై ఆరోపణలు చేస్తున్నారని, ఇది మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సుంచు చంద్రయ్య, తోట్ల రాజుయాదవ్, మెట్టుగుట్ట చైర్మన్ రఘుచందర్, గుర్రపు కోటేశ్వర్, బోయిని కుమార్‌యాదవ్, కూర్ల మోహన్, బైరి లింగమూర్తి, విజయ్ కుమార్, ఇమ్మడి రాజు తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



మోహినోద్దీన్ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కాజీపేట: కాజీపేట పట్టణంలో చిరు వ్యాపారులను దృష్టి మరల్చి వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వై.సుధాకర్ రెడ్డి తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ వరంగల్‌లోని పుప్పాలగుట్ట చింతల్‌కు చెందిన సయ్యద్ యాకుబ్ మోహినోద్దీన్‌కు ఇద్దరు భార్యలు, ఐదుగురు పిల్లలు ఉన్నారు. కిరాణం నడుపుకుంటూ జీవిస్తున్నాడు. దుకాణం ఆశించిన స్థాయిలో నడవకపోవడంతో పాటు కుటుంబ అవసరాలు పెరిగాయి. దీంతో సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చిరు వ్యాపారులను దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో గొర్రె నాగరాజు అనే వ్యక్తి దుకాణంలో రెండు రోజుల క్రితం చోరీకి పాల్పడగా సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి కడిపికొండ బ్రిడ్జి సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు సీఐ చెప్పారు.